క్లుప్తంగా

దోర్లమ్మ తల్లికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: కానవరం గ్రామదేవత దోర్లమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకుని, సారె సమర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు యర్రంశెట్టి శ్రీరామకృష్ణ, సంగీత సత్తిబాబు, వెంకటేశ్వర్రావు, వీర వెంకట్రావు, బాసిబాబు ఉన్నారు.

పూలే విగ్రహావిష్కరణ రేపు

రంగంపేట: గ్రామంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహావిష్కరణ మంగళవారం నిర్వహించనున్నారని మండల బీసీ నాయకుడు గుత్తుల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు పలువురు రాష్ట్ర, జిల్లా బీసీ నాయకులు హాజరవుతారని, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బీసీ సోదరులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దంత వైద్యశిబిరం

మధురపూడి: దంత సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని రాజమహేంద్రవరానికి చెందిన అయిత జయభారతి అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని అయిల వారి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆదివారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వందమందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ అయిల గోపీ, వైఎస్సార్ సీపీ కోరుకొండ అధ్యక్షుడు అయిల రామకృష్ణ, అయిల శ్రీను, పాపారావు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

బిక్కవోలు: అభాగ్య పిల్లలు, తల్లిదండ్ర లేని పిల్లలు మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఊలపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు మరణించి అనాథలుగా ఉంటూ పోషణకు దూరంగా ఉన్న పిల్లలు, తల్లి వితంతువు, విడాకులు తీసుకున్న వారి పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధికి గురై పిల్లలు కూడా అర్హులన్నారు. ఇలాంటి పిల్లలకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయంలోని మహిళ సంరక్షణ కార్యదర్శి అందించాలన్నారు.

చిన్నారికి తులాభారం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సూర్యారావుపేటకు చెందిన ఏఎస్ఓ వీరబాబు మనుమరాలికి ఆదివారం తులాభారం వేసి, మొక్కును చెల్లించుకున్నారు. బాబా సన్నిధిలో పటిక బెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేశారు. అనంతరం ఆలయ పూజారి ఆధ్వర్యంలో నామకరణ మహోత్సవం జరిపారు.

హుండీలలో నగదు చోరీ

సీతానగరం: రఘుదేవపురం కోట దుర్గమ్మ ఆలయం, ఆ గ్రామంలోని రామాలయం వద్ద ఉన్న కనక మహాలక్ష్మి ఆలయంలోని హుండీల్లో నగదును దొంగలు చోరీ చేశారు. ఆదివారం తెల్లవారుజాము 3 గంటలకు మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు యువకులు హుండీ తాళాలను పగలకొట్టి నగదును దొంగిలించినట్టు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైంది. ఈ రెండు హుండీల్లో సుమారు రూ.20 వేలు ఉండవచ్చని భావిస్తున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ల టెండర్ ప్రక్రియ పూర్తి

అనపర్తి: నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం పందలపాక, పెదపూడి మండలం సంపర గ్రామాల్లో రూ.6 కోట్లతో ఏర్పాటు చేసే విద్యుత్ సబ్‌స్టేషన్లకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయినట్టు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పందలపాక, సంపర గ్రామాల పరిధిలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య కారణంగా వివిధ పరిశ్రమలు, గృహ వినియోగదారులు, తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రెండు గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన తెలిపారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలో నిర్మాణాకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభానికి శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే తెలిపారు.

దానధర్మాల మాసం రంజాన్

- ముస్లింల జీవితంలో నమాజ్, రోజా తప్పనిసరి
- దానాలకు అధిక ప్రాధాన్యం
- ఒక రూపాయి దానం చేస్తే 70 రెట్లు ఫలితం



పందలపాక మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

బిక్కవోలు: ముస్లింలకు అత్యంత ప్రీతికరమైనది రంజాన్ మాసం. ఈ మాసాన్ని దానధర్మాల మాసమంటారు. ఈ మాసం ఒక శిక్షణ లాంటిది. ఈ నెలలో ఇస్లామియ బోధనల ప్రకారం జీవితం గడుపుతారు. దీనివల్ల మిగితా 11 నెలలు కూడా అదే విధంగా జీవించేలా అలవాటు అవుతుందని నమ్మకం. ఇదే కాకుండా ఆరాధన విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైంది. విధిగా చేయాల్సిన నమాజ్, రోజా, జకాత్, హాజ్ వంటి ఆరాధనలే కాదు. దేవుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఖురాన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పని ఆరాధన కిందికే వస్తుంది. అందుకే రంజాన్ మాసంలో చేసే ఏ పనులకైనా 70 రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఒక్క రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ మాసంలో అందరూ దానం చేస్తారు. నియోజకవర్గంలో అనపర్తి, రామవరం, కుతుకులూరు, బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం, రంగంపేట, సింగపల్లి, ముకుందవరం, గొల్లల మామిడాడ, సంపర తదితరులు గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక పార్థన జరుగుతున్నాయి.

దానధర్మాలు రెండు రకాలు

సమాజంలో నిర్భాగ్యులు, అనాథులను ఆదుకోవడానికి దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది. అందుకే ముస్లింలు రంజాన్ మాసంలో ఇతోధికంగా దాన ధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. ఇస్లాంలో దానధర్మాలు రెండు రకాలు ఒకటి తప్పనిసరిగా చేయవలసిన దానం జకాత్. జకాత్ అంటే శాబ్దిక అని అర్థం. తన వద్ద ఉన్న సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లిస్తారు. రెండో దానం ఫిత్రా. రంజాన్ మాసం తర్వాత రోజు ఈద్ నమాజ్ కన్నా ముందు ఫిత్రా తప్పనిసరిగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరి పేరిట ఫిత్రా దానం తప్పనిసరిగా చేయాలి. రెండు కిలోల 50 గ్రాముల ధాన్యం లేదా గోధువులు లేదా వాటి మార్కెట్‌లో వాటి ధరకు సరిపడ సొమ్మునైనా పేదలకు దానంగా చేయాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండగను చేసుకుంటారు. ముస్లిం దేశాల్లో జకాత్ వసూలు ప్రభుత్వం పరంగా జరుగుతుంది. కొన్ని ముస్లిం దేశాల్లో స్వతంత్ర సంస్థలు కూడా చేస్తాయి.

ఆరోగ్యం జాగ్రత్త

రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసం దీక్షలు పాటిస్తారు. కనీసం నీరు కూడా తీసుకోరు. అయితే షుగరు వ్యాధిగ్రస్తులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇఫ్తార్ సమయంలో ఆహార పదార్థాలు పానీయాలపై నియంత్రణ ఉండాలి. తక్కువ కేలరీలు ఉన్న ఆహార పదార్థాలే తీసుకోవాలి.

- ఇన్సూలిన్ ఉత్పత్తిని సరిదిద్దగలిగే సుగర్ ముందు మెట్ఫోర్మిన్ వాడుతున్న వారు ఇఫ్తార్ సమయంలో మాత్రల మోతాదులను వైద్యుడు సలహాతో తీసుకోవాలి.
- పాంక్రియస్ గ్రంథి నుంచి ఇన్సూలిన్ విడుదలకు దోహద పడే గ్లిబెన్క్‌మైడ్ మందులు వాడుతున్న వారు వైద్యుడి సలహాతో స్వల్ప వ్యవధికి పనిచేసే గ్లిపిజైడ్, రేపగ్లినైడ్ వాడవచ్చు. డయాబైటీస్ ఉన్న వారు ఉపవాసం ఉండవకపోవడమే మంచిది.
- అన్నం, చపాతీలు, నాన్, పప్పు, పండ్లు, కూరగాయలు వంటివి తీసుకోవాలి
- సహెరీ భోజనం మరీ అర్ధరాత్రి కాకుండా సూర్యోదయానికి ముందు తీసుకోవాలి. ఇది ఉపవాస సమయంలో సమాంతర శక్తి పొందడానికి, రక్తంలో చెక్కర స్థాయి స్థిరంగా ఉంచడానికి ఉపయోగ పడుతుంది.

దానం చేస్తే రెట్టింపు పుణ్యం



రమదాన్ మాసంలో రూ.1 దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లు కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే సంపదలో 2.5 శాతం జకాత్‌గా చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండగా చేసుకోవడానికే ఈ జకాత్ చెల్లిస్తారు.

–షేక్ రహిమాన్, పందలపాక

ఇది పుణ్యమాసం



మానవుల అధికంగా పుణ్యం చేకూర్చేందుకే అల్లా ప్రసాదించిన నెల రంజాన్. ఈ మాసంలో ఆధ్యాత్మికతలో గడపాలి. నిరుపేదలకు ఫిత్రా, జకాత్‌లు దాన ధర్మాలు చేయాలి. నిష్ఠతో ఉపవాసం ఉండాలి. మంచి పనులు చేయాలి. అప్పుడే అల్లా కరుణిస్తాడు. ఈ మాసంలో చిన్న దానం చేసినా పుణ్యం లభిస్తుంది.

–మౌలానా షేక్ గులాం గౌస్‌రిజ్వీ, మసీద్ గురువు పందలపాక

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



శహపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా, జనరంజకమైన పరిపాలన సాగిస్తూన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శహపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆప్యాయంగా ప్రజలను పలకరించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. తర్వాత గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చందాళ్ల పార్వతీ, సొసైటీ చైర్మన్ గాజంగి వెంకటరమణ, స్థానిక పార్టీ నాయకులు చందాళ్ల వెంకటరమణ, బుద్దాల శ్రీను, వసుం చిన వెంకటరమణ, రాయుడు మురళీ, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన.. సంక్షేమానికి చిరునామా



గరగలంపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గరగలంపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గరగలంపాలెంలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత గరగలం తల్లిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి 10.15 గంటల వరకూ స్థానిక ఎస్సీ, బీసీ, ఎస్టీ పేటల్లోని 130 గడపలు తిరిగారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. వెన్నెముక సమస్యతో బాధపడుతూ పనులు చేసుకోలేనిస్థితిలో ఉన్న కోళ్ల ప్రవీణ్ పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ. 5 వేలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే సంక్షేమ పథకాలందుతున్న తీరును తెలుసుకున్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ గ్రామంలో త్వరలో రూ.42.7 లక్షలతో 40 వేల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.32 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు అడబాల చినబాబు, కడియాల పాపారావు, గరగలంపాలెం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, బోడపాటి అరవాలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో టీడీపీ సీనియర్ నాయకుడు కడియం శ్రీరాములు, గరగలంపాలెం గ్రామానికి చెందిన మరుకుర్తి నూకరత్నం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారిని ఎమ్మెల్యే రాజా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన నాయకులను సమన్వయం చేసుకుంటూ గ్రామంలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, గ్రామ సర్పంచ్ కె.వెంకట రామకృష్ణ, గరగలంపాలెం నాయకుడు బోడపాటి కొండబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు'



ఎస్టీ రాజాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు



బిక్కవోలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు సుబ్బారావు



గోకవరంలో నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్‌ను తన ఇంటి గోడకు అతికిస్తున్న వృద్ధురాలు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎస్టీరాజాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ అడ్డాల పద్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామల్లో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్ అతికించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డాల వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు, బదిరెడ్డి ఈశ్వరరావు, లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో 'జగనన్నే మా భవిష్యత్తు'

బిక్కవోలు: గ్రామంలోని కొత్తపేట ఏరియాలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతోపాటు ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు హాజరై గ్రామంలో ఇంటింటా తిరిగారు. ప్రభుత్వ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత జగన్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలోని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, సర్పంచి సరెల్ల సుమలత, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, మండల జేసీఎస్ కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, క్లో ఆప్షన్ సభ్యులు షేక్ ఉస్మాన్ భాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రొంగల అప్పాజీ, తమ్మినేని నాగ శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు


గోకవరం: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు పలికిన వారి ఇళ్లకు వారి అనుమతితో స్టిక్కర్లను అతికించారు.

తూర్పుగానుగూడెంలో..


రాజానగరం: ప్రజారంజక పరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. మండలంలోని తూర్పుగానుగూడెంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బున శ్రీను, సీతారామపురం ఉపసర్పంచ్ పెదగొల్లబ్బాయి, నాయకులు చల్లా వెంకట్, పెద్దిరెడ్డి శ్రీను, చొల్లంగి శ్రీను, పెంకే పెద్దరాజు, రామ్మూర్తి పాల్గొన్నారు.

మూడో రోజు.. అదే జోరు

అనపర్తి: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మూడో రోజు ఆదివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో కొనసాగించారు. గ్రామ సచివాయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, గత టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. పెడపర్తిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతమ్మ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.



తూర్పుగానుగూడెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెడపర్తిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ

కాంగ్రెస్ నాయకుల పోస్టుకార్డు ఉద్యమం



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సీతానగరం: అదానీ అక్రమాలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రశ్నిస్తూనే ఉంటామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి అన్నారు. ఆదివారం సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూలం కిషోర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకుడు పిర్ల సురేష్ అధ్యక్షతన మోదీ, అదానీ అక్రమాలను ప్రశ్నిస్తూ పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శేషగిరి మాట్లాడుతూ అదానీ, మోదీ మిత్ర సంబంధాన్ని ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీపై మోదీ ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగిందన్నారు. కార్యక్రమంలో మట్టా రాము, ఈడి వెంకటరత్నం, దూలం అరుణ తేజ పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ బేతపూడి రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 24 వరకూ గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరంలో 3, 4వ తరగతులు చదివి ఉండాలని, తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 95665 59622 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధి రాజంపేటకు చెందిన కవల సత్యనాగు (19) అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనాగు తండ్రి రాజమహేంద్రవరం గణేష్ చౌక్ వద్దగల రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడికి బీపీ, సుగర్ ఉన్నందున తరచూ కళ్లుతిరిగి పడిపోతుంటాడు. తండ్రి ఆరోగ్య పరిస్థితిపై మనస్థాపంతో సత్యనాగు ఈనెల 7న ఇంటివద్ద గడ్డిమందు తాగింది. వెంటనే రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆసుపత్రి సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమాజసేవతో జీవితాలకు సార్థకత



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

రంగంపేట: సత్యసాయి సమాజసేవ, ఆధ్యాత్మిక సూక్తులను ఆచరణలో పెట్టి జీవితాలను సార్థకత చేసుకోవడానికి నిరంతరం సాధన చేయాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం కొత్త కొటపాడు గ్రామంలో రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మలిరెడ్డి వీర్రాజు, స్థానిక శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కంతర్ప వెంకట అమర్‌నాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన పుట్టపర్తిలో జరిగే సత్యసాయి ఆరాధనోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు, సేవాదళ్ సభ్యులు తరలిరావాలని కోరారు. వచ్చే నెల 21న రాజమహేంద్రవరంలో జరిగే నమామి శత రుద్రీయం కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, జిల్లా విభాగ సమన్వయకర్త ఎల్ శ్రీనివాస్‌రాజు, సబ్ జోన్ ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్తలు టి.సత్యనారాయణ, కె.భార్గవి, బాలవికాస్, కన్వీనర్లు టి.శ్రీనివాసరావు,కే.బానుమతి, సేవాదళ్ లీడర్ మాగాపు వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆరుగురి అరెస్టు

బిక్కవోలు: గ్రామ శివారుల్లో జరుగుతున్న కోడిపందెలపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులు అరెస్టు చేసినట్టు ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వచ్చిన సమాచారం మేరకు బిక్కవోలు గ్రామంలోని వీర్రాజు పేట శివారులో కోడిపందేలపై దాడి చేసి, ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లు, రూ.1,810 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిక్కవోలు: గ్రామానికి చెందిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన బిక్కవోలు వంతెన వద్ద లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన కటామల రాంబాబు(45) ఆదివారం ఉదయం కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాట్టు ఆయన తెలిపారు.


భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు




కరకుదురులో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ జోసఫ్ తంబీ



గోకవరంలో సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



కాపవరంలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

పెదపూడి: మండలంలో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెదపూడిలో బేతేలు చర్చిలో బిషప్ చుక్కా శామ్యూల్‌రాజు, దేవకుమారి దంపతులు దైవ సందేశాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం అందరూ సహపక్తి భోజనం చేశారు. పాస్టర్ చుక్కా జాన్ రత్నం, చర్చి యూత్ పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోరుకొండ ఎస్సార్ నగర్ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ జోసఫ్ తంబీ మాట్లాడుతూ దైవపుత్రుడైన ఏసుక్రీస్తు మానవుడిగా అవతరించి, శ్రమలను అనుభవించి, శిలువపై మరణించారన్నారు. సమాధి చేసిన మూడోరోజు తిరిగి లేచారన్నారు. పశ్చిమగానుగూడెం, జంబూపట్నం, కోటికేశవరం చర్చిలో ప్రార్థనలు చేశారు.

గోకవరం: ఈస్టర్ పండగను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని శ్మశానవాటికల్లో తెల్లవారుజాము నుంచి క్రైస్తవులు తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోకవరంలోని క్రైస్తవ శ్మశానవాటిక తెల్లవారుజామున కిటకిటలాడింది. చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా ఈస్టర్

బిక్కవోలు: ఈస్టర్ పండగను మండలంలోని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కాపవరంలో ప్లాసర్ ఎస్.యేసుపాదం ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తు పార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి గంగారాజు తదితరులు పాల్గొన్నారు.